ఉగాది కథల పోటీలో
మొదటి బహుమతి
రూ. 500 పొందిన కథ

# దావాగ్ని చెప్పిన సత్యం

తెనాలి
సుశీలాదేవి



ఒంటరిగా .... గదిలో ...
జీరోవాట్లు నీలం బల్బు
వెలుతురులో మంచం
మీద పడుకుని వున్న నేను
అసహనంగా అటూ ఇటూ
కదిలాను.
నాకు కావలసిన
అడుగుల చప్పుడు కోసం
నా చెవులు
రిక్కించుకునే వున్నాయి.

'చుక్క' లోపలికి పడిన నేను ఆగలేకపోతున్నాను.' రేచుక్క ' కోసం వెళ్ళిన మిత్రుడు యింకా రాలేదు మరి. ఎవరో యివాళ కొత్తసరుకు అన్నాడు. నాకు కొత్తనో .... మరి సరుకే కొత్తదో ! .... వాడు పట్టుకు వచ్చేసరికి నా నిషా పెరిగి నిద్దర కొట్టేస్తానో లేక యీ కిక్కు కాస్తా తగ్గిపోయి ....

చెప్పుల చప్పుడు వినిపించింది, చటుక్కున లేచి కూర్చున్నాను. 'ఉహూ' ఆ చప్పుడు అలా.... అలా....దూరంగా సాగిపోయింది. ఎవరో దారిన పోయే దానయ్యలు. నా ఒంట్లో నరాలన్నీ జివ్వున లాగుతున్నట్టుగా వున్నాయి. వురకలు వేస్తూ పొంగుతున్నాయి. వాటికి వుద్రేకం కావాలి, వుత్సాహం కావాలి. అనుభవం కావాలి, ఆనందం కావాలి. వుపశమనం కావాలి 'అబ్బా' యింకా ఎంతసేపు....

'ఈ అవస్థ ఎందుకు? హాయిగా ఫ్యామిలీ తెచ్చుకో కూడదూ' అంతరాత్మగాడు చటాలున దెబ్బతీశాడు.

"నువ్ నోరుముయ్యవోయ్. రోజంతటికీ కొన్ని క్షణాలు మాత్రమే పొందే హాయి కోసం ఆ బాదర బందీలన్నీ ఎవడు నెత్తిన పెట్టుకుంటాడు? తెల్లారి లేస్తే సణుగుళ్ళు, దేబిరింపులు, ఎత్తిపొడుపులు, ఏడుపులు, పిల్లలు, రోగాలు ఛా....ఛా....వీటన్నిటితో మనసు పాడయిపోయి అసలు కోరికే చచ్చిపోదూ, ఇదే హాయిగా వుంది."

ఏ పదిహేను, యిరవై రోజులకు ఓసారి యింటి వెళ్ళటం, ఓ రోజుండి వచ్చేయటం జీతంలో సగం యింటికి యిచ్చేస్తే మిగతా సగం తనొక్కడికీ....యింకా పైన ఆదాయం అంటూ ఏదయినా వస్తే అది....హాయిగా, జల్సాగా, తన యిష్టం వచ్చినట్టు ఆనందం కొనుక్కోవచ్చు.

అసలు యీ మధ్య ఎప్పుడో ఓసారయినా యింటికి వెళ్ళాలంటేనే భయంగా వుంది. తనిచ్చే డబ్బులు చాలటం లేదట. ఇంటి నిండా దరిద్రం. యిల్లాలి ముఖంలో దరిద్రం, పిల్లల రూపాల్లో దరిద్రం. వచ్చిన ఒక్కరోజయినా, ఉన్న ఒక్క రాత్రయినా సంతోషం పంచుదామని, సుఖం దక్కించుకుందామని బుద్ధిలేదు కదా దానికి. మీద చెయ్యి వేసేసరికి ప్రారంభం చేసేస్తుంది. చేసిన అప్పులు, తన అనారోగ్యం, పిల్లల అవసరాలు, రోగాలు, మందులు, చివరగా ఏడుపు—అంతే.... యింక చెయ్యివేస్తే ఒట్టు. తెల్లవారగానే ప్రయాణం ఇక్కడే....యిదే....యిలాగే....హాయిగా....ఆనందంగా వుంది....

సాలెగూడులా అల్లుకుంటున్న ఆలోచనల దారం పుటుక్కున తెగిపోయింది. తలుపు మీద 'టక్ టక్' చప్పుడు.

'స్ప్రింగ్'లా మంచంమీంచి లేచాను. మరు క్షణంలో నా చేతులు తలుపులు తెరిచాయి. మా వాడు లోపలికి వచ్చాడు. ఆత్రుతగా వాడి వెనక్కు చూశాను. నాకు కావలసింది ఏదీ (ఎవరూ) కనిపించ లేదు. కోపంగా వాడి ముఖంలోకి చూశాను. నా చేయి పట్టుకుని బరబరా మంచం దగ్గరకు లాక్కుని వచ్చాడు. విసురుగా పట్టు విడిపించుకున్నాను.

"కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తూంటే యిప్పుడు ఒక్కడివీ చేతులూపుకుంటూ వచ్చి నన్ను డిసప్పాయింట్ చేస్తావురా బ్రూట్. నీవేదో పెద్ద తెలిసిన వాడిలాగా 'తీసుకొస్తాను' అంటే సరేననుకున్నానుగానీ యిలాంటి చవటవని తెలిస్తే నేనే చూసుకుందును ఎక్కడయినా...."

యింకేం మాట్లాడకుండా తన అరచేతిని నా నోటి మీద మూశాడు వాడు. 'ఒరేయ్ కాస్త మెల్లిగా మాట్లాడరా బాబూ, నీకు కావలసింది తెచ్చాను కానీ'....

"ఏదీ....ఎక్కడా?" అడుగుముందుకు వేసిన నన్ను చేయిపట్టుకుని లాగాడు."కాస్త తగ్గుభాయ్. బయటే వరండాలో వుంది. చూడు నీకోమాట చెప్పాలి. ఫ్యామిలీటైప్ మరీ చీప్‌గా ప్రవర్తించకు."

"ఏమిటోయ్ పెద్ద వీళ్ళ దగ్గిర కూడా డీసెన్సీ పాటించాలా? డబ్బు పారేస్తాం మన యిష్ట మొచ్చినట్టు...."

"అదే వద్దన్నాను, అంత చీప్ క్వాలిటీ కాదు. అదయినా యీ మధ్యనే. యింకా పాతబడలేదు. పొద్దున్నే పంపించేటప్పుడు మరీ ఐదో, పదో చేతిలో పెట్టేవు సుమా. కనీసం ముప్పయ్ అయినా..."

తెరిచిన నోరు చప్పున మూసేసుకున్నాను గదిలోకి ప్రవేశించిన ఆవిడని చూసి. తలమీదుగా సగం ముఖం కప్పేస్తూ కొంగు కప్పుకుని వుంది.

'ఓ. కె. వుదయమే కలుసుకుందాం.' చకచకా వెళ్ళిపోయాడు మిత్రుడు. వాడి వెనకాతలే వెళ్ళి తలుపులు గడియపెట్టి వచ్చాను. పైట తలమీద కప్పుకుని అటువేపు తిరిగి నిలబడ్డ ఆమెని చూసి నవ్వొచ్చింది నాకు, 'ఓయబ్బా! శోభనపు పెళ్ళి కూతురిలా ఏం సిగ్గుపడుతూ నుంచుంది.'

"ముఖం ఎలావుందోగానీ వెనకనుంచి చూస్తూంటే ఒళ్ళు బాగానే వున్నట్టుంది" నా దృష్టితో నేను బేరీజు వేశాను.

"పెళ్ళికూతురిలా నిలబడ్డావేం? రా"

తలమీదున్న పైటకొంగు అందుకుని లాగాను. చివ్వున వెనక్కి తిరిగింది. ఇప్పుడా పైట నా చేతిలో వుంది. నా చూపులు కొన్ని క్షణాలు ఆ ఎత్తు గుండెల మధ్య చిక్కుకుపోయాయి. బలవంతంగా చూపులు పైకి జరిపాను. మెడ మీదుగా పెదవుల మీదుగా కళ్ళల్లోకి....

మరుక్షణం నా చేతిలోంచి ఆ పైటకొంగు జారిపోయింది.

"నీవు...నీవు...నిన్ను....నిన్ను...ఎక్కడో..."

"మిమ్మల్ని చూడ్డం మాత్రం యిదే మొదటి సారి" తుంచినట్టుగా అంది.

లేదు లేదు....కాదు ఎక్కడో చూశాను. సందేహంలేదు. నాకు బాగా గుర్తుంది ఆ ముఖం. అయితే ఎప్పుడు....ఎక్కడ నా మస్తిష్కంలోని ఆలోచనలు తీవ్రతకు నా శరీరం తన పని మరిచిపోయింది. జ్ఞాపకాల సరంలో పూసలు చక్కగా కుదరడంలేదు.

"నీ పేరు"

'శాంత' అసహనంగా అంది.

ఈ పేరుతో యిప్పటిదాకా నాకెవరూ తగల్లేదు మరి....

ఫ్యామిలీ టైప్ అన్నాడు నా మిత్రుడు. "మరి మీ ఆయన పేరు?"

"మనిద్దరి మధ్య జరిగే వ్యాపారానికి మా వారి పేరు అవసరమా" నెమ్మదిగా అంటున్నా యీ సంభాషణపట్ల అయిష్టత కనబడుతోంది.

"కాదనకు. కాని నిన్ను ఎక్కడో బాగా చూసినట్టుగా, అనిపిస్తోంది. అందుకని...."

"రైల్వేలో పని చేస్తారు" మెల్లిగా అంది.

పేరు చెప్పలేదు. ఫలాన వుద్యోగం అనీ చెప్పలేదు. అయినా నా మెదడులో మెరుపులా మెరిసింది ఆమె జ్ఞాపకం.

అవి నేను రిలీవింగ్ క్లర్క్‌గా పనిచేసే రోజులు. దక్షిణరైల్వేలో ఒక పెద్ద స్టేషన్‌కు వేశారు. ఆవేళే డ్యూటీకి వెళ్ళాను. ప్యాసింజరు ట్రెయిన్లన్నీ వెళ్ళిపోయాయి. ఫ్లాట్‌ఫారం మీది కొచ్చి నిలబడ్డాను సిగరెట్ త్రాగుతూ. పెద్ద గూడ్సు ట్రెయిన్ ఒకటి ఫ్లాట్‌ఫారం మీద ఆగి వుంది. అక్కడే షిఫ్టు మారుతుంది. ఒక డ్రయివర్ వచ్చి యింజన్‌లో ఎక్కి కూచున్నాడు. యిక బయలుదేరడమే తరువాయి. 'ఇదిగో... ఏమయ్యోవ్ ఆగు కాస్త' కేక వేసుకుంటూ చెమటలు కక్కుకుంటూ పరుగెడుతూ వస్తోంది ఒక ఆడది చంకలో పిల్లాడితో. అందరూ ఆమెకేసే కుతూహలంగా చూస్తున్నారు. ఆమె మాత్రం ఎవరినీ పట్టించుకోటంలేదు. నలుగురూ తనను

గమనిస్తున్నారని కూడా గుర్తిస్తున్నట్టు కనబడ లేదు. ఒక్క వుదుటున యింజను దగ్గరికి వచ్చింది. పిల్లాడిని ఫ్లాట్‌ఫారం మీద కుదేసింది. యింజన్లోకి ఎక్కింది. అందరూ అక్కడ పోగయి పోయి ప్రేక్షకుల్లా నిలబడిపోయారు.

"దిగు ముందు కిందికి దిగు. ఆ జీతం డబ్బులు నా మొహాన పారేసి ఎటన్నా పో" వగురుస్తూ అంది.

"ఛీ పో! సిగ్గులేని దానా! స్టేషన్‌కొచ్చి ప్లాట్‌ఫారంలో నిలేస్తావేం? రేపు పొద్దున్న యింటికి వచ్చేస్తాను. దిగి పో ముందు" ఆమెని పట్టుకుని దింపబోయాడు అతను.

"పొద్దున కొస్తావులే చేతులూపుకుంటూ. అదేం కాదు. ముందు జీతం యిచ్చేసి మరీ కదులు" ఆవిడ దిగలేదు; అతడిని విడువలేదు.

ఏడుస్తోంది. బ్రతిమాలుతోంది. గుంజుతోంది. జేబులో చేయి పెట్టబోతుంది. విదిలించి పారేస్తున్నాడు అతను. ఎవరో జోక్యం చేసుకుని వదిలించబోయేలోగా అతను ఆమెని క్రిందికి నెట్టడం ఆమె అతడిని వదలకుండా అతడి షర్టు కాలరు పట్టుకోడంతో అతనూ ప్లాట్‌ఫారం మీదకు వచ్చేయడం జరిగింది. ఆవిడ జుట్టు పట్టుకుని చెంపకేసి ఒక్క చరుపు చరిచాడు. గుడ్లనీళ్ళు కుక్కుకుంటోంది.

"ఆ డబ్బులు నాకు యిచ్చేసి నువ్వెట్లన్నాచావు నాలుగు రోజుల్నుంచి పిల్లలు పస్తున్నారు. చంటోడు జ్వరంతో చచ్చిపోతున్నాడు. యిచ్చేయి యిచ్చేయి" పులిలా మీదపడి జేబులో చేయి పెట్టపోయింది. ఒక్క విదిలింపు విదిలించాడు కిందపడిపోయిందామె.

"చెపితే నీక్కాదూ జీతంరానూ వచ్చింది. అయిపోనూ అయిపోయింది. అప్పులకు యిచ్చేసినా పో!" అంటూ ఒక్క విసురున బండి ఎక్కేశాడు. అప్పటికే గార్డు పచ్చజెండా వూపటం, బండి కదిలిపోడం జరిగిపోయింది.

నాకు ఆశ్చర్యంగా వుంది. ఏడెనిమిది వందల జీతగాడు యిట్లా వీధినబడి ఛీ....ఛీ అనుకుంటూ ఆమెకేసి చూశాను. 'ఒక్క పది రూపాయలన్నా యీరా పిల్లలు తిండికోసం చూస్తున్నార్రా. చంటిపిల్లోడు చచ్చిపోతాడురా' అంటూ యింజను వెంబడే ప్లాట్‌ఫారం చివరి అంచుదాకా పరుగు తీస్తోంది. ఆమె మాటలు యింజను శబ్దంలో కలిసిపోయాయి. బండి గాలిని చీల్చుకుంటూ వెళ్ళిపోయింది. టికెట్టు లేని సినిమా అయిపోగానే ప్రేక్షకులంతా తమ దారిన వెళ్ళిపోయారు. నిరాశ, నిస్పృహలతో, అవమానంతో, దుఃఖ భారంతో ఆ పసిబిడ్డను భుజాన వేసుకుని నడుస్తున్న శవంలా కదిలిపోయింది ఆమె. దైన్యం నిండిన ఆ ముఖం, వడలిపోయిన ఆ రూపం, భర్తను కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలుకునే ఆమె నిస్సహాయత నాలుగైదు రోజుల పాటు నన్ను వెంటాడుతూనే వుండిపోయాయి. తరువాత ఆ విషయం మరుగున పడిపోయింది.

ఇప్పుడు తిరిగి అదే—ముఖం....

అప్పుడు శవంలా ఎండిపోయిన మనిషి యిప్పుడు పెళ్ళికూతుర్లా తయారయింది. మొదళ్ల త్రుంచేస్తే ప్రక్కనే కొమ్మలు రెమ్మలు విరివిగా పెరిగిన గుబురు చెట్టులా నిండుగా వుంది. ఆ కళ్ళు మాత్రం గాజు కళ్ళలా నిర్జీవంగా వున్నాయి. అప్పుడు వాటిలో నిండివున్న నీళ్ళు; యిప్పుడవి ఎండిన చెరువులు.

"వీలయినంత త్వరగా నన్ను పంపించివేస్తే బావుంటుంది" ఆమె అసహనంగా మంచంవేపు కదలటంతో యీ లోకంలోకి వచ్చాను.

"నీ భర్త డ్రైవరు కదూ."

ఆమె మాట్లాడలేదు. అయినా నాకెందు కిదంతా నా పని నేను చూసుకోక అనిపించింది క్షణంసేపు. కాని ఏదో క్యూరియాసిటీ.

"చూడు నీ భర్త రైల్వేలో డ్రైవరు. ఆ స్టేషన్‌లో వుండేవాళ్లు కదూ. ఒక రోజు ప్లాట్‌ఫారం మీద అతనితో డబ్బుకోసం గొడవ పడి, జ్వరం పడిన పిల్లాడిని ఎత్తుకుని ఏడుస్తూ కదిలి వెళ్ళిపోయావు అవునా? తరువాతేం జరిగింది?"

నా ప్రశ్నకు సమాధానంగా అన్నట్లు ఆమె మంచం మీద కూలబడి వెక్కి వెక్కి ఏడవ సాగింది. నా గుండెల్లో ఏదో కదిలిక.

"ఒక వుద్యోగస్థుడి భార్యగా వుండి నీవు యీ వ్యాపారం చేయటం అవమానంగా,అసహ్యంగా లేదూ?" అన్నాను. నేను మర్యాదస్థుడినా గిల్టీగా అనిపిందింది నాకే. 'నేను మగవాడిని' అహం నన్ను వెన్నుతట్టి సపోర్టు చేసింది.

"అవమానాలు, అసహ్యాలు నా జీవితం నుంచి తప్పుకుని చాలా రోజులయింది. అయినా అవన్నీ మీకెందుకు? మాటలతోనే తెల్లారిపోతుంది. కాని నాకు డబ్బు చాలా అవసరం."

అనవసరంగా కాలయాపన చేస్తున్నాననే నింద వినిపించింది. ఆమెలో తొందర చేస్తున్నది నరాల తీపుకాదు. కడుపుతీపి. కాని....కాని.... నా శరీరం నాకు సహకరించటం లేదు. ఆమెతో అనుభవం కోసం వురకలు వేయటం లేదు. ఎందుకని....ఎందుకని .. ఆనాటి ఆమె దీనవదనం, నిస్సహాయస్థితి మాత్రమే గుర్తు వస్తోంది. ఆమెను తాకాలని కూడా కోరిక పుట్టటం లేదు.

"నీకు అనుకున్నట్టుగా డబ్బు యిస్తాను. నీ నుండి నాకేం అనుభవం వద్దు. కాని ఆ రోజు తరువాత ఏం జరిగింది? చెప్పగలవా?" నాకు తెలియకుండానే నాలో ఏదో ఆత్మీయత. ఎలాంటి వాడికయినా ఒక్కో సమయంలో ఒక్కో మనిషిని చూస్తే హృదయం స్పందిస్తుందేమో.

ఆమె చెబుతోంది. ఏదో కథ చెబుతున్నట్టు లేదు. ఆమెగుండెల్లో కరుడు గట్టుకుపోయిన బాధ కరుగుతోంది. కరిగి కరిగి ప్రవహిస్తోంది.

"నేనూ పెళ్ళికూతురిగా అందరి ఆడపిల్లలాగే ఎన్నో ఆశలతో కాపరానికి వచ్చాను. మొదట్లో బాగానే వుండేవాడు. ఆ తరువాత చాలా రోజులకి తెలిసింది—త్రాగుడు, పేకాట అంటు రోగాల్లా జీర్ణించుకుని వున్నాయని. ఎంతగానో నచ్చచెప్పి, బ్రతిమాలినా, బెదిరించినా లాభం లేకపోయింది.

'నీకేం యిబ్బంది లేదుకదా' అనేవాడు. నిజమే మొదట్లో యిబ్బందులు తెలిసేవికావు. ఒక్కొక్కరే మీద మీద నలుగురు పిల్లలు పుట్టేసరికి వాళ్ళకు పాలు, తిండ్లు, రోగాలు, మందులు, డబ్బు ఆవశ్యకతను తెలియజేశాయి. నా ఆరోగ్యమూ బాగా పాడయిపోయింది. అప్పటకే ఆయనకి ఆ వ్యసనాలు బాగా వంటబట్టిపోయి యిల్లూ, పిల్లలూ కనబడకుండా పోయాయి. యింట్లో యిచ్చే డబ్బు యేమూలకీ చాలటం లేదు. అంతకి రెట్టింపు తన ఒక్కడి సరదాలకి ఖర్చుచేసేవాడు. కొన్నాళ్ళ తరువాత తెలిసింది తను వెళ్ళే రూట్‌లో ఎక్కడో యిద్దరు స్త్రీలని పెట్టుకుని మేపుతున్నాడని. తన అవసరాలు ఎక్కువయ్యే కొద్దీ యింట్లో యిచ్చే డబ్బు చాలా తగ్గించేశాడు. ఎంత డబ్బూ చాలక పోయేసరికి అక్కడక్కడా బ్రాందీ షాపుల్లో, సిగరెట్ బంకుల్లో పేకాట స్నేహితుల దగ్గరా అప్పులు పెరిగాయి. జీతంలో సగం అప్పులకి పోను మిగత తన ఖర్చుకే. అలాంటప్పుడు డ్యూటీ నుండి తిరిగి వచ్చినా యింటికి రాకుండానే మళ్ళీ బండీ ఎక్కేసేవాడు. ఎన్నాళ్ళు మందులు, సరుకులు? ఎవరుమాత్రం అప్పుగా యిస్తారు? ఏ యిరుగు పొరుగయినా ఎన్నాళ్లు మన అవసరాలు

తీరుస్తారు? నేను చేసిన అప్పులకి అప్పులవాళ్ళు యింటికే వచ్చారు. ఇంట్లోని ఒక్కో వస్తువూ కాళ్ళొచ్చినట్టు నడిచిపోయాయి. వీధిలోకి వెళ్ళి ఎవరి ముఖమయినా చూడాలంటే భయంగా వుండేది. అవమానంగా వుండేది.

మా పరిస్థితి కారణంగా అందరికీ చులకన అయిపోయాము. ఒకసారి ఎందుకో మావారు వస్తారేమో నన్నట్టు వీధి తలుపు ఆనుకుని నుంచుని వున్నాను. మా ఎదురు క్వార్టర్సులో వుండే ఒకతను రమ్మన్నట్టు తలవూపడం చూచి చట్టున తలుపు మూసి లోపలికి వచ్చేశాను. పెళ్ళాం కాన్పుకి వెళ్ళింది. నా స్థితి వాడికి అనువుగా కనిపించింది. ఆవేళ ఎందుకో కుమిలి కుమిలి ఏడ్చాను.

ఎంత హీనం కాకుంటే, ఎంత లోకువ కాకుంటే సాటి ఉద్యోగస్థుడి భార్యను పిలువగలుగుతాడు! డబ్బు లేనంత మాత్రాన, దరిద్రం చుట్టుకుంటున్న మాత్రాన అంత చవుకా? అప్పుడప్పుడు యధాలాపంగా కంటపడినా వెకిలిచేష్టలు, సైగలు చేసేవాడు.

నెమ్మదిగా చంటిపిల్లల్ని దగ్గరతీసి బిస్కట్లు, పిప్పరమెంట్లు పెట్టేవాడు. ముందే తిండికి ముఖం వాచి వున్న యీ పిల్లలు అస్తమానం వెళ్ళేవాళ్ళు. ఎంత మందలించినా నా కన్ను గప్పి ఎప్పుడో జారుకునేవారు.

ఓసారి బాబు వచ్చి చెప్పాడు.

"అమ్మా......అమ్మా......ఆయన దగ్గరేమో యింత డబ్బుంది. చూపించాడు. మాకు లేదే అన్నాను. మీ అమ్మను రమ్మను ఇస్తాను అన్నాడు. వెళ్ళవే.... బోలెడు డబ్బులిస్తాట్ట. ఎంచక్కా గిన్నె నిండా అన్నం, పులుసూ, చేసుకుని....కంచం నిండా పెట్టుకుని...."

మాటలు పూర్తిచేయక ముందే పడిన నా దెబ్బకి గింగిరాలు తిరిగి క్రిందపడిపోయాడు. ముందే బలహీనంగా వున్నాడేమో....నా చేతి దెబ్బ ఎలా తగిలిందో మరి స్పృహపోయింది. నా గుండెలు అవిసిపోయాయి. నీళ్ళుచల్లి వాడిని ఒడిలోకి తీసుకున్నాను. నేనెంత పాపిష్టిదాన్ని? యీ దరిద్రుల కడుపున పుట్టడమే వాళ్ళు చేసిన నేరమా? వాడడిగినదాంట్లో తప్పొప్పులు తెలుసుకునే వయసు వాడికుందా. ఆ ఎదురింటి వెధవ ఏదో కూసి వీడితో చెప్పి పంపితే వీడికర్థం అయ్యేదంతా అప్పనంగా డబ్బు వస్తుందని మాత్రమే. వాడు చెప్పి పంపిన దాంట్లో ఎంత అర్థం వుందో,



ఈ కథ – 'దావాగ్ని చెప్పిన సత్యం' రాసిన శ్రీమతి తెనాలి సుశీలాదేవి-భర్త ఉద్యోగరీత్యా ధర్మవరంలో వుంటున్నారు. శ్రీమతి సుశీలాదేవి ఎక్కువగా కథలు రాయకపోయినా, రాసిన కథలు వారపత్రికల్లో వచ్చాయి. 'వనిత'లో తన కథ రావడం ఇదే మొదటిసారనీ, తనకు బహుమతి రావడం కూడా ఇదే మొదటిసారనీ, చెప్పారామె. "మనలోనూ మన చుట్టూ వున్న వాస్తవిక జీవితాల్లోనూ వున్న చేదు నిజాల్ని గ్రహిస్తూ మనల్ని మనం సరిదిద్దుకునే రచనలు చెయ్యాలని నా ఆశయం" అనే సుశీలాదేవి – తన రచనలకు తొలి పాఠకులు, విమర్శకులూ తన భర్త శేషగిరిరావుగారే – అని చెప్పారు. ఈ దంపతులకు ఇద్దరు అబ్బాయిలు సంతానం.

అంత డబ్బు ఎందుకు ఇస్తానన్నాడో ఆలోచించేంత తెలివి, అనుభవం ఈ పసివాడికున్నాయా? వాడికి కావలిసిందంతా, వాడు కోరిందంతా ఏమిటి - బట్టలడిగాడా, సినిమాలు అడిగాడా....అన్నం....పులుసు గిన్నెనిండా వండుకుని కంచం నిండా పెట్టుకుని.... ఎంత చిన్న కోరిక! కంచం నిండా అన్నం పులుసూ కంటి కింపుగా పెట్టుకుని, కడుపునిండా తిని ఎన్ని రోజులయిందో. అలాంటి రోజు కోసం ఆశ.... కడుపునిండా అన్నం కోసం తృప్తిగా తినేలా గిన్నెడు పులుసుకోసం .... ఎంత నికృష్టమయిపోయింది నా బ్రతుకు. ఈ పసివాళ్ళ కడుపులు సగం మాడుస్తూ ఇంకా వాళ్ళని కొట్టడం కూడానా? నాలోనేనే కుళ్ళికుళ్ళి ఏడ్చాను.

ఆ రోజు నుండి ఎవరూ గడపదాటి వెళ్ళరాదని కఠినంగా చెప్పాను. బిస్కెట్ల కోసం, పిప్పరిమెంట్ల కోసం అలవాటు పడిన చంటివాడి మారాం మాత్రం దెబ్బలు పడేకొద్దీ ఎక్కువయ్యేది.

ఈయన ఇంటికి వచ్చిన రోజు కొంచెం ఆశ కలిగేది. ఏమైనా ఇవ్వకపోతారా అని బిచ్చక త్తెకు పారేసినట్లు నాలుగు డబ్బులు పడేసి వెళ్ళిపోయేవారు. ఇంటి పరిస్థితి చెప్పబోతేవాలు. నిద్ర నటించేవాళ్ళు. పగలయితే చెప్పుల్లో కాళ్ళు దూర్చి వెళ్ళేవాళ్ళు. ఆయనున్న రోజు మాత్రం అందరం భోంచేసేవాళ్ళం. తరువాత మళ్ళీ మామూలే. వారం పదిరోజులయినా ఇంటికి వచ్చేవారు కాదు. వచ్చినప్పుడేమయినా గొడవ చేస్తే ఆ మాత్రమూ రారేమోనని భయం వేసేది.

ఎనిమిదివందల రూపాయల వుద్యోగస్థుడి కుటుంబం బిచ్చగాళ్ళ కన్న నికృష్టదశలోకి వచ్చేసింది. పిల్లల కడుపులు నింపలేక, వాళ్ళ ఆకలి ముఖాలు చూడలేక గుండెలు బద్దలయ్యేలా ఏడిచేదాన్ని. నకనకలాడే కడుపులతో వాళ్ళు నిద్రపట్టించుకోలేక పొర్లాడుతుంటే నా గుండె తరుక్కుపోయేది.

చివరికి ఒకనాడు....అనాడే మీరు నన్ను చూశానంటున్నారు. చంటివాడు జ్వరంతో మూడు రోజులుగా బాధ పడుతున్నాడు. వాడికి మందులేదు; మాకులేదు. ఆస్పత్రి రంగునీళ్ళు పని చేయలేదు. ప్రయివేటు డాక్టరు దగ్గరకు వెడితే మందులయితే వ్రాసి యిచ్చాడు. కానీ నా దగ్గర కొనడానికి డబ్బేది? పిల్లాడి పరిస్థితి భయంగా వుంది. ముందు రోజు రాత్రి ఇంటికి వచ్చారు. ఇంటి పరిస్థితి, పిల్లాడి పరిస్థితి ఎంతో దీనాతిదీనంగా చెప్పాను. 'ఉదయం జీతాలు వస్తాయేమో చూద్దాంలే' అన్నారు. ఆ మాటతో నాకు ఎంతో బలం వచ్చింది.

ఆ ఉదయం బయలుదేరి వెడుతూంటే మళ్ళీ మళ్ళీ చెప్పాను. జీతం వస్తే వెంటనే ముందు యింటికి రమ్మని, పిల్లాడి పరిస్థితి చాలా ఆందోళనగా వుందనీ, ఒకవేళ యిప్పుడే జీతం అందకపోతే ఎక్కడయినా ఓ పది రూపాయిలు బదులు తెమ్మని. ఆ మధ్యాహ్నం మూడు గంటలవరకూ చూశాను. మనిషి అయిపులేడు. నాలో ఏ మూలో ఆశ....వెనువెంట దాన్ని చంపుతూ అనుమానం. ఒక వందసార్లయినా వీధి గుమ్మంలోకి వెళ్ళి సందు మలుపు దాకా చూశాను. కొంచెంసేపు అలాగే నిలబడ్డాను. నాకు తెలిసిన ఒకబ్బాయి వస్తూ కనిపించాడు.

"స్టేషన్‌లో సార్ గాని కనిపించారా" అడిగాను.

"చూశానండీ. ఇంతకు ముందే అందరూ అక్కడ జీతాలు తీసుకున్నారు. ఇప్పుడు బయలు దేరుతున్న బండికి వెడుతున్నారు గదండీ—"

అన్నాడు. నా నెత్తిన పిడుగు పడినట్టు, నా ఒళ్లు దహించుకుపోతున్నట్టు అనిపించింది. నాలో ఏదో పిచ్చి ఆవేశం. ఏం చేస్తున్నానో నాకే తెలియలేదు. జ్వరం వచ్చిన పసివాడిని చంకన వేసుకుని పట్టాలు దాటుకుంటూ, పరుగుతీస్తూ, పడుతూ లేస్తూ ప్లాట్ ఫారం చేరుకునేసరికే ఆయన ఇంజన్‌లోకి ఎక్కేశారు. తరువాత జరిగింది మీరు చూశారు. బండీ పట్టాల మీద కాదు నా గుండెల మీది నుంచే పోయింది. 'వాడు నాకు మొగుడుకాదు ఈ పిల్లలకు తండ్రీ కాదు' అనుకున్నాను ఆ క్షణమే.

చావు ముఖంలో వున్న పిల్లవాడిని దక్కించుకోవాలని ఎక్కడెక్కడో ఎంతో ప్రయత్నం చేశాను. బిడ్డ పరిస్థితి ప్రమాదంగా వుందనీ మందులు యిస్తే తప్పకుండా డబ్బు త్వరగా యిచ్చేస్తానని మందుల స్టోరులో అడుక్కొని లేదనిపించుకున్నాను. కట్టుకున్న వాడికే లేని కనికరం ఎదుటి పరాయివాళ్ళకు వుంటుందనుకోటం నా తెలివి తక్కువ.

కాళ్ళూ చేతులు ఆడని ఆ పరిస్థితిలో అపస్మారకంలో వున్న పసివాడిని భుజాల మీద వేసుకుని అటూ ఇటూ తిరుగుతూ వున్నాను యింట్లో. గుమ్మం దగ్గరగా వచ్చిన నేను ఎదురింటి వేపు చూశాను. ఆ యింటి గది కిటికీలో అతను— ముఖ్యంగా అతని చేతిలో రెపరెపలాడుతున్న నోట్లు, నేనున్న పరిస్థితిలో దిక్కుతెలియని ఆ కారు చీకటిలో ఆ కాంతికిరణ మొక్కటే కనిపిస్తోంది. అది నన్ను కాలుస్తుంది. నాకు తెలుసు. అయినా సరే నా పిల్లలకు వెలుగునిస్తుంది. నా గుండె రాయి చేసుకున్నాను. నా ఒళ్ళు మొద్దుబారిపోయింది. పసివాడిని చాప మీద పడుకోబెట్టి, తలుపులు దగ్గరగా మూసి తడబడుతూ అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి ఆ గుమ్మం ముందు నిలుచున్న నా మనసులో ఒకే ఒక్క ఆలోచన 'బాబును బ్రతికించుకోవాలి.'

వాడి ఒంట్లో వేడిని చల్లార్చి నా గుండెల్లో మంటలు రగిలించుకున్నందుకు ప్రతిఫలంగా ముట్టిన నోట్లను గుప్పిట్లో కుక్కుకుని అప్పటికప్పుడు మందుల షాపుకు వెళ్ళి మందులు తెచ్చాను. కాని .... కాని ఏం జరిగింది? ఇంకే మాత్రం ఆలస్యం భరించలేనన్నట్లు బాబు హాయిగా నిద్రపోతున్నాడు. చల్లగా శాంతిగా విశ్రాంతిగా.... నిద్రపోతున్నట్టున్న పసివాడిని ఒళ్లోకి తీసుకున్నాను. నా గుండె కాలిపోతోంది. నా కడుపులో పేగులు తిప్పుతున్నట్లుగా, నాలో ఒకే ఒక్క ఆలోచన నా మనసుని కోసేస్తుంది యిప్పటికీ. చివరి క్షణాన 'అమ్మ' కోసం వాడి కళ్ళు ఆశగా చుట్టూ చూసివుంటాయా' ఆ మాట తలుచుకుంటే చిత్రవధ చేసినట్టుగా వుంటుంది. వాడు అట్లా ఆశగా కలయ చూసిన క్షణాన నేను ఎక్కడున్నాను....ఎక్కడున్నాను? పశువులా మీద పడి తన ఆశ తీర్చుకుంటున్న పొరుగింటి వాడి పక్క మీదనా? భగవంతుడా—ఎటువంటి పరిస్థితి! 'బాబూ....నీ కోసం నీ ప్రాణాల కోసం నేను నలుగుతున్నానురా' కాసేపు ఆగి వుండ కూడదా....నీ కోసం చీకట్లో పరుగెత్తుతూ, పట్టాలు దాటుకుంటూ, పడుతూ లేస్తూ మీ అమ్మ మందులు తెస్తున్నందుకైనా కొన్ని క్షణాలు ఆగకూడదురా? నీకు కూడా ఎందుకు కనికరం లేకపోయింది నాయనా....'' ఇవే ఇవే నా గుండెని తొలిచివేసి కుళ్ళి కుళ్ళి ఏడ్చేదాన్ని.

పిల్లవాడి తండ్రి ఎక్కడుంటాడో టెలిగ్రాం ఇప్పిస్తామన్న వాళ్ళని వారించాను. ఆ హంతకుడి చేతులతో మట్టికప్పడం కూడా నాకు యిష్టం లేకపోయింది. ఇదీ ఒక విధమైన తెగింపే. యిరుగు పొరుగు ఈసడించారు కూడా. ఆడదానికి అంత మొండితనం కూడదని. వాళ్ళకి తెలుసా నన్ను కాలుస్తున్న నిప్పు? ఎవరేమయినా అనుకోనీ-అన్న మొండితనం వచ్చేసింది. ఆ తెగింపులో నేను నిర్ణయించుకున్నది ఒకటే. ఏం చేసయినాసరే మిగతా పిల్లల్నయినా కాపాడుకోవాలి. వాళ్ళనీ పోగొట్టుకోకూడదు.

అంతే—ఆ రోజే మొదలు. తరువాత తరువాత అలవాటయిపోయింది. అవసరాలు అలవాటు చేశాయంటే బావుంటుందేమో. సరుకు బావుంటేగాని, సొగసుగావుంటే గానీ ఎవరూ కొనరు కదా. అందుకే నన్ను నేను బాగా పోషించుకుంటున్నాను. నా మనసు మసిబారి పోయింది. కానీ నా ముఖం కాంతులీనుతుంది. నా గుండె బండబారిందే కాని నా ఒళ్ళు పట్టుకుచ్చులా మెత్తగా మృదువుగా వుంది. నా పిల్లలు ఇప్పుడు గిన్నెనిండా అన్నం పులుసూ వండుతుంటే చూసి కంచం నిండా పెట్టుకుని తినగలుగుతున్నారు. కంటినిండా నిద్రపోతున్నారు. వీళ్ళలో ఇంకెవ్వరూ చచ్చిపోరు ఎవ్వరూ చచ్చిపోరు. తిండిలేక గానీ, నిద్రరాక గానీ, మందులు లేక గానీ చావరు. చావరు; చావనియ్యను.''

ఆమె ఆవేశంతో పిచ్చెక్కిన దానిలా మాట్లాడుతోంది. కాదు-కాదు ఆమె లోలోపల కరుగుతున్న బాధ పుడుకుతున్నలావాలా పొంగి పొంగి బయటికి రావడానికి కాస్తంత మార్గం కనబడగానే వెల్లువలా ప్రవహిస్తోంది.

“ఆగు. ఇదంతా నీ భర్తకు తెలియదా?''

మళ్ళీ అడిగాను అదే ప్రశ్న. నవ్వింది. ఆ నవ్వులో జీవం లేదు.

“తెలుసు. నేనే చెప్పాను. పిల్లాడు పోయాక, ఆయన తిరిగివచ్చాక వాడు పోయినట్టు నేను మాత్రం చెప్పలేదు. బండి దిగిరాగానే స్టేషనులోనే ఎవరో చెప్పినట్టు వుంది. ఇంటికి రాగానే నేనేం విరుచుకుపడతానో అన్నట్టు తప్పుకుని తప్పుకుని తిరిగారు. నేనా ప్రసక్తే తేలేదు. ఎవరో యింటికి వచ్చిన చుట్టంలా ఆయనకి వండాను. పెట్టాను. అడక్కుండానే డబ్బు యిచ్చారు. ఆ రాత్రికి ఆయనతో పడుకున్నాను. నేను అంత త్వరగా సహకరిస్తానని వూహించలేదు ఆయన. తరువాత నేనే చెప్పాను. డబ్బు యిచ్చారు గనుక పక్కలో చేరానని. ప్రస్తుతం తన భార్య పిల్లలు బ్రతుకుతున్నది యిలాంటి డబ్బుతోనేనని.

ఆ మాట విన్నప్పుడే గుర్తువచ్చినట్టుంది తను మగవాడినని. నేను అతని పెళ్ళాన్నని. చావచితకబాదాడు. నానా బూతులు తిట్టాడు. కాని ఏం జరిగింది? ఆ వుదయమే తనిచ్చిన డబ్బుకు మరో ఇరవై కలుపుకుని తీసుకెళ్ళిపోయాడు. ఆ తరువాత మళ్ళీ మళ్ళీ వచ్చినప్పుడు నా దగ్గరున్న డబ్బు కోసమే వచ్చేవాడు. తన భార్య ఒళ్ళమ్ముకుని సంపాదిస్తున్న డబ్బుని తెలిసీ తన జల్సాలకోసం ఖర్చుపెట్టుకునే 'మగవాడు' నా మొగుడు. భార్యల సంపాదనల మీద బ్రతుకు వెళ్ళమార్చే ఎందరో భర్తలుండవచ్చు కాని 'యిలాంటి' సంపాదనకు కూడా చేయి జాస్తున్న భర్తకు భార్యనయిన దురదృష్టవంతురాలయిన ఆడదాన్ని నేను.''

“అయితే రేపు నీ పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు అయ్యాక నిన్ను అసహ్యించుకుంటే....''

ఛెళ్ళున కొరడా దెబ్బ తిన్నదానిలా తలెత్తి చూసింది.

“ప్రతి క్షణం నన్ను నేనే అసహ్యించుకుంటున్నాను. యీ శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరుక్కుందాం అని కూడా అనిపిస్తుందొక్కోసారి. కాని రెక్కలు రాని, ముక్కు పచ్చలారని నా పిల్లల కోసం బ్రతక్క తప్పదు. నా పిల్లలు నన్ను ఏవగించుకొనేంత పెద్దరికం సంపాదించినపుడు వాళ్ళ బాధ్యత నాకుండదు. వాళ్ళ నుండి దూరంగా పోతాను. అప్పుడయినా నాకు యీ హీనపు బ్రతుకు నుండి విముక్తి లభిస్తుంది. తరువాత నేనేమయినా ఫరవాలేదు.''

"మరి ప్రతి క్షణం ఏవగించుకుంటూ నయినా యీ బ్రతుకు బ్రతక్కపోతే నీ పిల్లలకూ యింత విషం యిచ్చి, నీవూ యింత తిని ఒక్కసారిగా విముక్తి పొంది వుండొచ్చుగా."

చాలా సినిమాల్లో, కథల్లో చూసిన దృశ్యాలు గుర్తుకొచ్చి అడిగాను. తలెత్తి సూటిగా నా కళ్ళల్లోకి చూచింది.

'ఛీ. నీవూ ఒక మనిషివేనా' అన్నట్టు గ్రుచ్చుకుంది ఆ చూపు.

"కొన్ని క్షణాలపాటు అనుభవించే ఆనందం వల్లనే మీరు పిల్లల పుట్టుకకు కారణమవుతారు. తండ్రులవుతారు. కాని ప్రతి కాన్పుకి తన ప్రాణం ఒడ్డి జీవం పోసే ఆడది మీకు ఎట్లా అర్థం అవుతుంది? నా కడుపులోని ప్రేగులు తెంచుకుని పుట్టిన పాపలు వాళ్ళు. ఒక్కొక్కరికి కుండెడు రక్తం ధారపోసి కన్నాను. అట్లాంటి పిల్లలకి నా చేతులతో నేను విషం యిచ్చి చంపేయడమా? అట్లాంటి ఆలోచన వచ్చిన దురదృష్ట ఘడియలు లేకపోలేదు. కాని....చూస్తూ చూస్తూ....రెక్కల చాటున ఒరిగి పడుకున్న పక్షికూనల్లా నన్ను వాటేసుకుని చుట్టుకున్న ఆ బుల్లిబుల్లి చేతులను, కాళ్ళను ఆ పాలుగారే బుగ్గలను నిర్జీవం చేయలేకపోయాను. పోగొట్టుకున్న ఆ ఒక్క బిడ్డ జ్ఞాపకాలూ నా జీవితమంతా కాలుస్తూనే వుంటాయి. కన్న బిడ్డలను చేతులారా ప్రాణాలు తీయలేక, నేనయినా ఏదయినా మింగి చద్దామనుకుంటే వీళ్ళనలా వీధికొక బిచ్చగాడిగా కాలే కడుపులతో ఎండిన డొక్కలతో వూహించలేక అసమర్ధురాలిని అయ్యాను. తండ్రి వదిలేయ గలిగాడు గాని తల్లిగా నేనా పని చేయలేకపోయాను.

'ప్రాణం కన్న శీలం ముఖ్యం' అని అందరూ అనేమాట. ఏ సినిమా చూచినా, ఏ కథ చదివినా కనిపించేది వినిపించేది ఆ మాటే. నిజమే. కాని యిక్కడ నా వొక్క ప్రాణమే అయివుంటే అది ఏనాడో గుటుక్కుమనిపించి వుండేదాన్ని. కాని నా ప్రాణానికి ప్రాణాలు నా పిల్లలు. ఏం చేసయినా సరే ఏం పోగొట్టుకుని అయినాసరే నా పిల్లల్ని నేను బ్రతికించుకోవాలి. అంతే...."

ఆమె మాటలో ఒక ధ్యేయం. ఆమె ముఖంలో ఒక దృఢ నిశ్చయం కనిపించాయి.

"జీవనాధారానికి యీ పని తప్ప మరేమార్గమూ లేదూ" అన్నాను. కాని అన్నీ వున్న నేను మరి యిట్లా తప్పుడు పనులెందుకు చేస్తున్నానో.... ఒక్క క్షణం నా మనసు నన్ను తట్టింది.

నా ప్రశ్నకి ఆమె నవ్వుతోంది. యింకా... యింకా....యింకా....పగలబడి నవ్వింది. ఏడుపుకి వచ్చిన కన్నీళ్లు యీ నవ్వుతో రెట్టింపు అయ్యాయి. అతికష్టం మీద ఆపుకుని మళ్ళీ పెదవి విప్పింది.

'నేను చదివింది ఎలిమెంటరీ స్కూలు వరకే. వుద్యోగాలు చేసుకునేంత గొప్ప చదువులు చదవలేదు. మరే విద్యలూ రావు. భిక్షమెత్తలేను. ఏ వంకరాలేని నేను భిక్షానికి పోయినా వుమ్మేతారు జనం. పాచిపనులు చేసి కుట్టుమిషను మీద యింత సంసారం గడపడానికి యిది సినిమా కాదు. నవల కాదు. చదివి పక్కన పడేసే కథ కాదు. జీవితం. రాత్రీ, పగలూ, రోజులు, నెలలు, సంవత్సరాల తరబడి వెన్నాడి వేధించే జీవితం. చదువు సంధ్యలు లేని నేను యింతేసి మాటలు మాట్లాడటం మీకు ఆశ్చర్యంగా వుండొచ్చు. కాని జీవితంలోని అనుభవాలు ఎన్నో పాఠాలు నేర్పుతాయి. ఎన్నో మాటలూ నేర్పుతాయి. మీరు చదువుకున్నారు. మీ చదువుని అమ్ముకుంటారు. తెలివిగల వాళ్ళు తమ తెలివిని అమ్ముకుంటారు. ఏ విద్య నేర్చిన వాళ్ళయినా ఆ విద్య కొనగలవాళ్ళ దగ్గర అమ్ముకుంటారు. బ్రతుకు బాట సాగిస్తారు. అలాగే అలాగే....నేనూ నాకున్నదాన్ని అమ్ముకుంటున్నాను. నా అందాన్ని, నా ఆడతనాన్ని నా బ్రతుకు తెరువుకోసం అమ్ముకుంటున్నాను. ఎందరో ఆడవాళ్ళలాగా నేనూ పెళ్ళి, సంసారం, భర్త, పిల్లలు అనే కలల మంటపంలోకి వచ్చాను. నా దురదృష్టం కొద్దీ కూలిపోయింది. పందిరి వీడి ప్రక్కకు పడిపోయిన తీగలాగ నలుగురి కాళ్ళక్రింద నలిగి తొక్కివేయబడ్డాను. అట్లా కాక నేను నమ్ముకున్న మగవాడు నా జీవన లత అల్లుకున్న పందిరి దృఢంగా, నమ్మకంగా వుండివుంటే నా జీవితమూ ఎందరో గృహిణుల లాగానే కలకలలాడుతూ వుండేది. నేను చేస్తున్నది నీచమైన పనే. కాదనను. అయినా నాకు మరో మార్గం లేదు. మీలాంటి కొనే మహారాజులున్నంతవరకు మాలాంటివాళ్ళకు యిదీ ఒక దారే కదా! బ్రతుకు బాట ఎలాగోలా సాగించాలి. రహదారిన వెళ్ళడానికి అదృష్టం, అర్హత అందరికీ వుండవు. యిది ప్రక్క దారే; దొంకదారే అయినా నడక సాగించక తప్పదు. పథవిహీనులమే అయినా ప్రతి ఒక్కరూ గమ్యంవైపు సాగాల్సిందే కదా" ఆమె మాటలు వింటూంటే నాలో వుప్పెన. నా హృదయంలో కల్లోల తరంగాలు, దావాగ్నులు విపరీతమయిన భయం, బాధ, ఆవేదన నాలో ఏదో పిరికితనం.

ఇలాగే....ఇలాగే....జరిగితే ఏదో ఒకనాటికి నా సంసారం కూడా యిలాగే మారుతుందా?

నేను సృష్టిస్తున్న సమస్యలలోంచీ, బాధలలోంచీ బయట పడటానికి నా భార్య కూడా ఎప్పటికయినా యిలా తెగిస్తుందా? తనూ ఒక పిల్లల తల్లే కదా. జీవితంలో తనూ విసిగిపోవచ్చు. పిల్లలకోసం ఆడది ఏమయినా చేస్తుందా? ఎంతకయినా తెగించేందుకు సిద్ధపడిందంటే అందుకు కారకులెవరు? మగవాడు కాదా? నాలాంటి మొగుడు కాదా?

బాధ్యత ఎరిగి తన భార్య, తన పిల్లలు తన సంసారం అని తన శక్తికొద్దీ భారం మోస్తే కష్టమయినా సమానంగా స్వీకరిస్తుంది భార్య. భర్త పక్కకు తప్పుకున్ననాడు భారం మోయలేని ఆడది తప్పటడుగులు వేయడమో కూలిపోవడమో జరిగి తీరుతుంది. ఈమె జీవితం విధి వ్రాసిన వ్రాత కాదు. ఒక మగవాడు వ్రాసిన వ్రాత.

కదిపిన తేనె తుట్టలా నా మనసు కల్లోల పడింది. నా మనసు, మస్తిష్కం తీవ్రమైన వేదనకు గురయ్యాయి. నిముషాల మీద నా కర్తవ్యం పట్ల దృఢ నిశ్చయానికి వచ్చాను. జేబులోంచి నోటు తీసి యిచ్చాను. దానికేసి చూసి ఆశ్చర్యపోయింది. "వంద రూపాయలా మరి నన్ను మీరు...."

"నాకు కావలసిందేదో నీవు యిచ్చావు. అంతే చాలు యిక నీవు వెళ్ళు" అంటూ ఆమెను పంపివేశాను. గబగబా బట్టలు వేసుకున్నాను. తాళం వేశాను. ఆమె నిశ్శబ్దంగా చీకటిలో కదిలిపోతోంది. నా పాదాలు బస్టాండ్‌కేసి దారి తీశాయి. మొదటి బస్సు అందుకోవాలి. చకచకా అడుగులు వేస్తున్న నా మనసులో ఒకే ఆలోచన. ఒకే దృఢ నిశ్చయం. ఈమె జీవితం నేను మార్చలేను. కాని యింకో జీవితం యిలా మారటానికి ఎలాంటి అవకాశం యివ్వకుండా జాగ్రత్త తీసుకోవాలి. నేనూ అలాంటి భర్తగా తయారుకాకూడదు. నా పాత జీవితానికి స్వస్తి చెప్పాలి. నా హఠాత్తాగమనం చూసి నా భార్య ఆశ్చర్యపోతుందేమో—నాతో పాటు అందర్నీ తీసుకువెళ్ళడానికే వచ్చేనంటే మూర్ఛపోతుందో....

కదులుతున్న బస్సులోకి ఎక్కి కూచున్నాను. నాకన్నా ముందుగా వెళ్ళి నా హృదయం నా భార్య చుట్టూ పరిభ్రమిస్తోంది. □